క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



అమర్‌నాథ్‌తో మక్సూద్ అహ్మద్

దాబాగార్డెన్స్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దక్షిణ నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులైన మక్సూద్ అహ్మద్ బుధవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

చిన్నారుల నృత్య ప్రదర్శన అదుర్స్



నృత్యం చేసిన చిన్నారులతో నిర్వాహకులు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 33వ వార్డులో వేంచేసియున్న నీలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో నగరానికి చెందిన నాట్యదీపిక కూచిపూడి అకాడమీ చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది. అకాడమీ వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ ఎల్.ఇంద్రాణి నేతృత్వంలో పలువురు చిన్నారులు చేసిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నిర్వాహకులు చిన్నారులను అభినందించారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారిణులు

అల్లిపురం: శివరాత్రి సందర్భంగా డీబీకే రైల్వే క్వార్టర్స్‌లో నాట్య కళారాశి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నిర్వాహకులు కళాకారులను సత్కరించారు.

వివేకానంద సంస్థలో మహాన్నదానం



అన్నదానం చేస్తున్న వేణుగోపాల్, కుటుంబ సభ్యులు

దాబాగార్డెన్స్: స్వామి వివేకానంద సంస్థ వద్ద సుమారు వెయ్యి మంది పేదలకు బుధవారం అన్నదానం చేశారు. ప్రముఖ సంఘ సేవకుడు వేణుగోపాల్ కుమార్తె ప్రియాంక, చంద్రమౌళి దంపతుల పెళ్లిరోజును పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. సంస్థలో ఆశ్రయం పొందుతున్న పలువురు వృద్ధులకు వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో వేణుగోపాల్ కుటుంబ సభ్యులు, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులు పాల్గొన్నారు.

శివతాండవం కావ్యంపై ప్రసంగం



ప్రసంగిస్తున్న రాంభట్ల నృసింహశర్మ

సీతంపేట : మహా శివరాత్రి సందర్భంగా సహృదయ సాహితి ఆధ్వర్యంలో సరస్వతి పుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులు రచించిన శివతాండవం కావ్యంపై తిరుమల బ్రహ్మోత్సవ వ్యాఖ్యాత రాంభట్ల నృసింహశర్మ ప్రసంగ కార్యక్రమం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. నాట్య సంప్రదాయంలోని పలు విశేషాలను ఆయన వివరిస్తూ శివతాండవ, శివలాస్య నాట్యాలను ప్రతిభావంతంగా ఎలా వర్ణించారో... ఎన్నో చరణాలను గానం చేస్తూ కవి ప్రయోగించిన పలు శబ్దాల భావార్థాలను సభకు వివరించారు. డి.వి.సూర్యారావు మాట్లాడుతూ నారాయణాచార్యుల కవితా ప్రతిభను వివరించారు. కె.జి.వేణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో దర్భముళ్ల చంద్రశేఖర్, భాగవతుల సత్యనారాయణ, చిన సూర్యనారాయణ పాల్గొన్నారు.

హరహర మహాదేవ శంభో శంకర

ఆలయాల్లో ప్రతిధ్వనించిన శివనామస్మరణ

దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



విశేష అలంకరణలో పంచముఖేశ్వర స్వామి



పంచముఖేశ్వరునికి అభిషేకం చేస్తున్న భక్తులు





నీలమ్మ వేపచెట్టు రోడ్డులో జీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివలింగం



బౌదరా రోడ్డు శివాలయం వద్ద బారులు తీరిన భక్తులు



డీబీకే రైల్వే క్వార్టర్స్‌లో శివ లింగానికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు



చంద్రమౌళేశ్వరస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు



పాతనగరం శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: పరమశివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన మహా శివరాత్రి వేడుకలు నియోజకవర్గంలో అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి శివుని దర్శనం కోసం ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. జలాభిషేకాలు, క్షీరాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణలు, రుద్రాభిషేకాలు, హోమాలు, భక్తుల శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. రోజంతా ఉపవాసాలతో గడిపారు. రాత్రి జాగారంతో శివనామస్మరణ చేశారు. ద్వాదశ జ్యోతిర్లింగాలకు విశేష పూజలు, వివిధ అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం నుంచి అర్ధరాత్రి లింగోద్భవ కాలం వరకు రుద్రాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పరమశివుని దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మెయిన్ రోడ్డులో గల విశ్వేశ్వరాలయంలో వేకువజాము నుంచే పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. సింగ్‌హోటల్ జంక్షన్ శివాలయం వీధిలో ఉన్న ఓంకార ఆలయంలో ఓంకారేశ్వర స్వామికి అభిషేకాలు జరిపారు. రాత్రి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఏవీఎన్ కాలేజీలో ఉన్న శివాలయం, పోలీస్ బ్యారెక్స్‌లో గల ఉమా రామలింగేశ్వరాలయం, పోలీస్ క్వార్టర్స్‌లో గల ఉమా రామలింగేశ్వరాలయం, వన్‌టౌన్ భీమశంకరాలయం, గొల్లలపాలెంలో గల శివాలయం, పెరికివీధిలో గల శివాలయం, అస్సాం గార్డెన్స్‌లో గల శివరామకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బురుజుపేటలో గల భావన రుషి ఆలయంలో శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు.

శివయ్యకు వాసుపల్లి ప్రత్యేక పూజలు

పాత పోస్టాఫీస్ సమీపాన గల శివాలయంలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ బుధవారం ప్రత్యేక పూజలు జరిపారు. స్థానిక పార్టీ నాయకులు, పలు అనుబంధ సంఘాల అధ్యక్షులతో కలిసి శివలింగానికి క్షీరాభిషేకం చేశారు. స్వామి కరుణాకటాక్షం దక్షిణ నియోజకవర్గ ప్రజలు, పార్టీ నాయకులు లభించాలని, ముఖ్యంగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ విశాఖ జిల్లా ఆర్టీఏ అధ్యక్షుడు వద్ది దిలీప్, పలు వార్డుల నాయకులు పీతల వాసు, దశమంతుల మాణిక్యాలరావు, బెవర మహేష్, ఆకుల శ్యామ్‌కుమార్, దశమంతుల రామలక్ష్మి, కోన శంకర్, ఆరుగుల రాజు, సాగర్, రాము, వేణు, బంగారి, సత్యం పాల్గొన్నారు.

జీవీఎంసీ టీఎస్సార్‌లో ప్రత్యేక పూజలు

జీవీఎంసీ టౌన్ సర్వీస్ రిజర్వాయర్ (టీఎస్సార్)లోని శివ మందిరంలో పంచామృతాభిషేకాలు, బిల్వార్చన, ప్రత్యేక పూజలు జరిపారు. జీవీఎంసీ ప్రధాన ఇంజినీరు పి.శివప్రసాదరాజుతో పాటు పలువురు అధికారులు, జీవీఎంసీ తాగునీటి విభాగం ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అల్లిపురం: టూ టౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో ఉమా చంద్రమౌళీశ్వరస్వామికి అర్చకుడు భార్గవ శర్మ ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం మహా రుద్రాభిషేకం చేశారు. నమకచమక విన్యాసాలతోపాటు పంచాక్షరి మంత్ర జపం నిర్వహించారు. ఓం నమఃశివాయ నామస్మరణతో దేవాలయం మార్మోగింది. అదేవిధంగా డీబీకే రైల్వే క్వార్టర్స్‌లో గల భవానీ శంకర ఆలయంలో, మురళీధర వీధిలో పంచముఖేశ్వర ఆలయంలో అర్చకుడు పి.సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు, పండ్లరసాలతో ఏకవారాభిషేకాలు, సాయంత్రం 3 గంటల నుంచి మహా రుద్రాభిషేకం చేపట్టారు. బౌదరా రోడ్డులో గల శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- మహా శివరాత్రి సందర్భంగా నీలమ్మ వేపచెట్టు రోడ్డులో జీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివలింగం, నంది విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు స్వామిని దర్శించుకున్న తర్వాత సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటూ సందడి చేశారు.



ప్రత్యేక పూజలో జీవీఎంసీ అధికారులు

దుర్గాలమ్మ ఆలయానికి భారీగా భక్తులు

దాబాగార్డెన్స్: నగరంలోని పూర్ణామార్కెట్ దరి వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం ఆలయానికి భారీగా భక్తులు తరలివచ్చారు. వేకువ జాము నుంచే అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. భవానీ మాలలు ధరించిన భక్తులు తలపై పసుపు నీళ్ల బిందెలు పెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి విచ్చేసి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి అభిషేకం చేశారు. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు. అర్ధరాత్రి 12 గంటలకు అమ్మవారి నేత్రోత్సవం, తొలిపూజ అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారి జాతర ఉత్సవం శనివారం భారీగా నిర్వహించనున్నట్టు ఈవో పేర్కొన్నారు. గురువారం దుర్గాలమ్మ వార్షిక జాతర మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. మార్చి 6న మారువారం పండగ నిర్వహించనున్నారు.

ఆధ్యాత్మిక సందడి

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా కల్లుపాకలు, దుర్గాలమ్మ గుడి ఏరియా, వెలంపేట, ప్రసాద్ గార్డెన్స్, పండావీధి, పెరికివీధి, రాజా రామ్మోహన్‌రాయ్‌రోడ్డు తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున కలశాలు, పూల ఘటాలతో ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాల్లో పులులు, దశవతారాల్లో దుర్గమ్మ, సింహాద్రి అప్పన్న, కోలాటం, అష్టదుర్గలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు భవానీ మాలధారులు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. రాత్రి 9 గంటల నుంచి పలు వీధుల్లో ఆర్కెస్ట్రాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలు స్వచ్ఛంద సంస్థలు ఉచిత ప్రసాదం, మజ్జిగ పంపిణీ చేశాయి.



అమ్మవారికి భోగం తీసుకెళ్తున్న భవానీ మాలధారులు



శూలం ధరించి వెళ్తున్న భవానీ మాలధారులు

వైభవంగా నీలమ్మవేపచెట్టు అమ్మవారి జాతర

- దర్శనానికి బారులు తీరిన భక్తులు
- అమ్మవారికి ప్రత్యేక పూజలు



పూజలు అందుకున్న అమ్మవారు



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

అల్లిపురం: అస్సాంగార్డెన్స్‌లో వెలసిన శ్రీ నీలమ్మవేపచెట్టు అమ్మవారి శివరాత్రి వార్షిక జాతర మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జీవీ రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శంభర జోగారావుశర్మ ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. భక్తుల సౌకర్యార్థం క్యూ లైన్లు ఏర్పాటు చేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాటం, పులివేషాలు, ఇతర కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. స్వచ్ఛంద సంస్థలు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశాయి.

ఎరుకుమాంబ సన్నిధిలో నేత్రపర్వంగా వేడుకలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

సీతమ్మధార: దొండపర్తిలోని శ్రీ ఎరుకుమాంబ అమ్మవారి దేవస్థానంలో మహాశివరాత్రి వేడుకలు బుధవారం నేత్రపర్వంగా జరిగాయి. తెల్లవారుజామున అమ్మవారిని విశేషంగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జీవీ రమాబాయి పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు జరిగాయి. కుంకుమ పూజల్లో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. సాయంత్రం సాంస్కృతిక, నృత్య, వినోద కార్యక్రమాల మధ్య అమ్మవారి ఊరేగింపు మహోత్సవం వైభవంగా జరిగింది. ఈవో రమాబాయి, అర్చకుడు శ్రీనివాసరావు, ఉద్యోగి సత్యనారాయణరాజు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించారు.

అలరించిన ఘంటసాల గానావధానం



ఘంటసాల పాటలపై అవధానం చేస్తున్న సయ్యద్ రహమతుల్లా తదితరులు

సీతంపేట : మహా శివరాత్రి సందర్భంగా ఘంటసాల ఆరాధకుల టెలిగ్రామ్ గ్రూప్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం లలితానగర్‌లో గల స్వరాలయ స్టూడియోలో బుధవారం ఘంటసాల ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సయ్యద్ రహమతుల్లా ఆధ్వర్యంలో పలువురు గాయనీ గాయకులు ఘంటసాల ఆలపించిన ఆపాత మధుర గీతాలు ఆలపించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. నందగోపాల్ ఘంటసాల వేషంలో హావభావాలలతో, గానంతో అలరించారు. సోమయాజుల సత్యవేణి ఘంటసాల సావిత్రి వేషంతో మెప్పించారు. ఘంటసాల పాటలతో నందగోపాల్ ప్రదర్శించిన బుర్రకథ ఆకట్టుకుంది. డాక్టర్ సయ్యద్ రహమతుల్లా చేసిన గానావధానం సభికులను ఆశ్చర్యపర్చింది.

అలరించిన 'అష్ట ప్రహరి'

భక్తితో 24 గంటల అఖండ హరినామ సంకీర్తన



హరినామ సంకీర్తనలు ఆలపిస్తున్న ఉత్కల్ యువ సేవా సమాజ్ సభ్యులు

అల్లిపురం: బౌదరారోడ్డు, పండావీధిలో ఉత్కల్ యువ సేవా సమాజ్ ఆధ్వర్యంలో శివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన అఖండ హరినామ సంకీర్తన (అష్టపహరి) భక్తులను అలరించింది. బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన హరినామ సంకీర్తన గురువారం ఉదయం 10 గంటలకు పూర్తవుతుందని నిర్వాహకులు తెలిపారు. ఏటా పలు బృందాల సభ్యులతో ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. అనంతరం నగర సంకీర్తన, ప్రసాద సేవ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు పశ్చిమ బెంగాల్‌వాసి



పశ్చిమబెంగాల్ వ్యక్తిని కుటుంబానికి అప్పగిస్తున్న శ్రద్ధా సంస్థ సభ్యులు

సీతమ్మధార: ద్వారకానగర్ ఏయూటీడీ వసతిగృహంలో ఆశ్రయం పొందుతున్న పశ్చిమబెంగాల్ వాసి రెండేళ్ల అనంతరం కుటుంబ సభ్యుల చెంతకు చేరారు. వివరాలివి.. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని రాణిగంజ్ నివాసి అయిన మొహమ్మద్ హైదర్ షేక్ (40) పెయింటింగ్ పని చేసేవాడు. పెళ్లయ్యాక సొంత దుకాణం పెట్టుకున్న అతను, సరిగ్గా నడవక అప్పులపాలయ్యాడు. ఆ ఆందోళనతో వ్యాధిగ్రస్తుడైన హైదర్‌కు ట్రీట్‌మెంట్ ఇచ్చినా పూర్తిగా నయం కాలేదు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం ఇల్లు వదిలి వచ్చేసిన అతను విశాఖ చేరాడు. ఇక్కడ ఏయూటీడీకి పట్టుబడడంతో ద్వారకానగర్ టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని జీవీఎంసీ ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహానికి తరలించారు. అక్కడ సంస్థ అందించిన సేవలకు బాగా కోలుకున్నాడు. ఈ క్రమంలో హైదర్‌ను శ్రద్ధా సిబ్బంది వైజాగ్ నుంచి తీసుకుని వెళ్లి బుధవారం అతని తల్లి, భార్య, అన్నదమ్ములకు క్షేమంగా అప్పగించారు. హైదర్‌ను అప్పగించడంతో సంతోషం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు, ఏయూటీడీ, శ్రద్ధా సంస్థ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

పండా వీధిలో అన్నసమారాధన



పండావీధిలో అన్నప్రసాదం వడ్డిస్తున్న కనకరెడ్డి

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు పండావీధిలో మహా శివరాత్రి సందర్భంగా బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్‌సీపీ వార్డు నాయకుడు కనకరెడ్డి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఆయన మాట్లాడుతూ చిన్నబోయిన విజయ్ ప్రతి ఏటా వార్డులో ఐదు వేలమందికి అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు పైడిరాజు, ఆరము నగేష్, వెంకటరమణ, ఈశ్వరరావు, దేవుడు, శివ తదితరులు పాల్గొన్నారు.

హిమలింగానికి ప్రత్యేక పూజలు



మంచు శివలింగానికి పూజలు చేస్తున్న కార్పొరేటర్ చెన్నా జానకీరామ్

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 37వ వార్డు పరిధి ఎగువ రెల్లివీధి పంచాయతీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శబరినగర్‌లో మంచు శివలింగం ఏర్పాటు చేశారు. వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు చెన్నా శివ, వద్దాది శివప్రసాద్ (వీపీటీ), ఎరుకునాయుడు, చెన్నా చంద్ర, చెన్నా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

చందనం సమర్పణకు విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి చందనం సమర్పణ నిమిత్తం రూ.50 వేల విరాళాన్ని నగరంలోని సీతమ్మధార ప్రాంతానికి చెందిన ఎ.రఘురామరాజు బుధవారం అందించారు. ఆలయంలో సూపరింటెండెంట్ త్రిమూర్తులకు విరాళాన్ని చెక్ రూపంలో ఇచ్చారు. కార్యక్రమంలో హవల్దార్ సాతులూరి రవి, ఉద్యోగి నాయుడు పాల్గొన్నారు.